## క్లుప్తంగా

### రాజశేఖర్‌కు డాక్టరేట్



పాలకుర్తి టౌన్ : పాలకుర్తి మండలంలోని బమ్మెర గ్రామానికి చెందిన నూనావత్ రాజశేఖర్ డాక్టరేట్ సాధించాడు. 'డెవలప్‌మెంట్ అండ్ వాలిడేషన్ ఆఫ్ అనలైటికల్ మేథడ్స్ ఫర్ ది క్యాంటిఫికేషన్ ఆఫ్ సింథటిక్ అనలాగ్స్ విజ్ ఇంప్యూరిటీ ప్రొఫైలింగ్ ఇన్ హెర్బల్ ఫార్ములేషన్స్' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను జేఎస్ఎస్ అకాడమీ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్, మైసూర్, ఫార్మసూటికల్ అనాలసిస్ విభాగంలో డాక్టరేట్ ప్ర దానం చేసింది.జెఎస్ఎస్ కళాశాలలో ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణవేణి నాగప్ప ఆధ్వర్యంలో సీ నియర్ రీసెర్చ్ ఫెలోగా ఆయన తన పరిశోధన లు చేశారు. రాజశేఖర్ రాసిన ఆర్టికల్స్ అంతర్జా తీయ సైంటిఫిక్ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. డాక్టరేట్ పొందిన రాజేశేఖర్‌ను కు టుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

### నిధులు మంజూరు

స్టేషన్‌ఘన్‌పూర్ : నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ డివిజనల్ స్థాయి కార్యాలయాల కాంప్లెక్స్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.26 కోట్ల నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ డివిజన్, నియోజకవర్గ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్ హెడ్ క్వార్టర్‌లో అన్ని ఆధునిక హంగులతో ఇంటిగ్రేటెడ్ డివిజనల్ ఆఫీస్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీఓ జారీచేసినట్లు పేర్కొన్నారు.

### బైకులు ఢీకొని.. ఇరువురికి గాయాలు

చిల్పూరు : మండలంలోని చిన్నపెండ్యాల గ్రామ బస్ స్టేజీ సమీపంలోని జాతీయ రహదారి యూటర్న్ వద్ద ఆదివారం రాత్రి ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ కొనడంతో ఇరురికి తీవ్ర గాయాలయ్యాయి. వేలేరుకు చెందిన కర్రెట్ల ధర్మారావు ఘన్‌పూర్‌లో పని ముగించుకుని స్వగ్రామానికి బయలుదేరాడు. చిన్నపెండ్యాల గ్రామ సమీపంలో యూటర్న్ తీసుకుంటుండగా హనుమకొండ నుంచి ఘన్‌పూర్‌కు బైక్‌పై వస్తున్న సింగపురం రాజేష్ ధర్మారావు బైక్‌ను ఢీకొనడంతో ధర్మారావుకు తీవ్రంగా, రాజేష్‌కు సైతం గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

### రైతుపై గుడ్డేలుగు దాడి



గాయపడిన నారాయణ

పాలకుర్తి : మండలంలోని అయ్యంగారిపల్లి గ్రామానికి చెందిన రైతు ముసుకు నారాయణపై గుడ్డేలుగు దాడి చేయడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం రేగులగడ్డ–అయ్యంగారిపల్లి పరిధిలో జరిగిన ఈ సంఘటనలో నారాయణ తలతో పాటు ఇతర చోట తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

### సభ్యత్వ నమోదు

జఫర్‌గఢ్ : గ్రామస్థాయిలో టీడీపీ బలోపేతానికి కార్యకర్తలు పాటుపడాలని ఆపార్టీ వరంగల్ పార్లమెంట్ అడహక్ కమిటీ కన్వీనర్ అర్షనపల్లి విద్యాసాగర్‌రావు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్ట రజనీకాంత్ కోరారు. మండల కేంద్రంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం వారు ప్రారంభించారు.

### బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

- 22 నుంచి 25 వరకు ఉత్సవాలు



ముస్తాబైన లక్ష్మీనర్సింహస్వామి ఆలయం

జఫర్‌గఢ్ : మండల కేంద్రంలోని వేల్పుగొండ కొండపై వెలసిన శ్రీ లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 22వ తేదీ నుంచి జరగనున్నాయి.కొండ దిగువన ఉన్న లక్ష్మీనర్సింహసీతారామచంద్రస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగులతో సర్వంగా సుందరంగా తీర్చిదిద్దారు. ప్రతి ఏటా నిర్వహించే బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పాడిశేటి వెంకటాచార్యులు, కృష్ణమచార్యులు విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. 22న సాయంత్రం 5గంటల నుంచి ప్రత్యేక పూజ కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 23న సుదర్శన నారసింహ హోమం, పూర్ణాహుతి, ఆరగింపు, తీర్థగోష్ఠి, 24న లక్ష్మీనర్సింహస్వామి కల్యాణమహోత్సవం, గరుడ వాహనంపై స్వామి వారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, 25న స్వామి వారి చక్రస్నానం, పల్లకిసేవ, పుష్పయాగం తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.బ్రహ్మోత్సవాల్లో భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# వరికొయ్యలతో భూసారం

**కలియ దున్నితే అధిక పోషకాలు**

- పంట పూర్తయ్యాక వరికొయ్యలు కాల్చుతున్న రైతులు
- సూపర్‌ఫాస్ఫేట్ వాడితే కుళ్లిపోతాయి..
- వాతావరణ, ఆరోగ్య సమస్యలు తప్పవని అధికారుల హెచ్చరికలు



కొడకండ్ల: వరి కొయ్యలు కాల్చుతున్న రైతు



బచ్చన్నపేట: పొలంలో కాలుతున్న వరికొయ్యలు

కొడకండ్ల : వానాకాలం వరి కోతలు పూర్తయింది..మిగిలిన కొయ్యలను (వ్యర్థాలు) రైతులు కాల్చివేస్తున్నారు. దీంతో అనేక సమస్యలు ఏర్పడతాయి..ఇప్పటికే దేశ రాజధాని ఢిల్లీలో ఊపిరిఆడని విధంగా గాలికాలుష్యంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అదే పరిస్థితి మన వరకు రాకముందే అన్నదాతలు అవగాహన పెంచుకోని వరికొయ్యలను కాల్చకుండా ఉండడమే ఉత్తమమం. సెప్టెంబర్ చివరి వారం నుంచి నవంబర్ వరకు వరి కోతలు పూర్తయ్యాయి.. మిగిలిన వ్యర్థాలను రైతులు తొలగిస్తుంటారు. వరి కొయ్యలు కాల్చడం వల్ల పర్యావరణ కాలుష్యానికి, వాతావరణ మార్పులకు దోహదపడే కార్బన్‌డైయాక్సైడ్, మిథేన్, కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్ డైఆక్సైడ్ వంటి హానికర గ్రీన్ హౌస్ వాయువులను విడుదల చేస్తోందని వ్యవసాయ అధికారులు అభిప్రాయపడుతున్నారు. హానికర వాయువులతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటాయని, భూమి ఉష్ణోగ్రత పెరుగుతుందని, అలాగే ఆరోగ్యంపై కూడా అధిక ప్రభావం చూపి ఊపిరితిత్తులు, కళ్లు, చర్మ వ్యాధులతో పాటు గుండె జబ్బుల ప్రమాదం కూడా ఉంటుందని చెబుతున్నారు. రైతులు అవగాహన పెంపొందించుకొని వరి కొయ్యలను కాల్చకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు అనర్థాలను అరికట్టవచ్చని అధికారులు సూచిస్తున్నారు. వరి కొయ్యలను పశువులకు ఆహారంగా, సేంద్రియ ఎరువుగా మార్చుకోవడం ద్వారా నేల సాంద్రత పెరగడం, రసాయన ఎరువుల వాడకం తగ్గి పంట దిగుబడి పెరుగుతుందని, బయో ఇథనాల్‌గా మార్చడం వల్ల శిలాజ ఇంధనాలపై ఆధారపడటం తగ్గుతుంది. గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలు తగ్గుతాయని, రైతుల ఆదాయం పెరుగుతుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

#### వరి కొయ్యలు కాల్చొద్దు..

బచ్చన్నపేట : రైతులు వరి కోతలు చేసిన తర్వాత మిగిలిన కొయ్యలను కాల్చుతారని, వాటిని కాల్చకూడదని మండల వ్యవసాయ అధికారి విద్యాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ..వరి పొలంలో పంటలకు మేలు చేసే మిత్ర పురుగులు ఉంటాయని, ఆ పొలంలో మంటలను పెడితే అవి చనిపోతాయని తెలిపారు. వర్షాలు అధికంగా పడడంతో వరి కోతలను పైకి కోసినందున ఆ కొయ్యలు కుళ్లడానికి సూపర్‌ఫాస్ఫేట్ మందును చల్లుకోవాలన్నారు. దుక్కి దున్నే సమయంలో బీడు భూమిలో ఈ మందును చల్లుకుంటే సులువుగా ఉంటుందన్నారు. అలాగే వరి కొయ్యలను కాల్చే సమయంలో గాలులకు మంటలు పక్కకు వీచి గడ్డి వాములు కూడా కాలిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో వరి కొయ్యలను కాల్చకూడదని ఆయన తెలిపారు.

#### ప్రత్యామ్నాయం అనుసరించాలి



వరి కొయ్యలు కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యం, పర్యావరణ మార్పు, నేల క్షీణత, ఊపిరితిత్తుల సమస్యలు నెలకొంటాయి. వీటిని నివారించేందుకై రైతులు ప్రత్యామ్నాయ పద్ధతులను అవలంబించాలి. కంపోస్టింగ్, బయోఇథనాల్ ఉత్పత్తి, బయో గ్యాస్ ఉత్పత్తి, మల్చింగ్ వంటి ప్రత్యామ్నాయ పద్ధతులను రైతులు పాటించాలి.

– రామారావు, జిల్లా వ్యవసాయాధికారి

## పీహెచ్‌సీకి స్థలం కేటాయించాలి



స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

జనగామ రూరల్ : జనగామ పట్టణంలోని 17, 29వ వార్డు సమీపంలోని శ్మశాన వాటిక స్థలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి స్థలం కేటాయించాలని సీపీఎం పట్టణ కమిటీ సభ్యుడు చిలుకమారి మణిరత్నం అన్నారు. ఆదివారం వార్డులో ఉన్న శ్మశానవాటికను వార్డు పార్టీ నాయకులు, మహిళలతో కలిసి వారు సందర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. ప్రజల అవసరాలకు, వృద్ధులకు, చిన్న పిల్లలకు అందుబాటులో ఉండే ఆస్పత్రికి స్థలాన్ని కేటాయించి, మరి కొంత భాగాన్ని ఓపెన్ జిమ్‌కు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాము అంజమ్మ, రమ, జయక్క, ఉపేంద్ర, పద్మ , రజిత,సందీప్, భరత్ , సూర్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## వెలగని 'సెంట్రల్ లైటింగ్'



అలంకారప్రాయంగా మారిన సెంట్రల్ లైట్లు

కొడకండ్ల : మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ ఏడాది గడుస్తున్నా వెలగడం లేదు. గతేడాది మాజీ మంత్రి దయాకర్‌రావు మోడల్‌స్కూల్ నుంచి బ్లాక్ ఆఫీస్ చౌరస్తా వరకు ఆర్అండ్‌బీ రోడ్డుపై సెంట్రల్ లైటింగ్‌ను మంజూరు చేయించారు. మోడల్‌స్కూల్ నుంచి పాపన్న చౌరస్తా వరకు ఏర్పాటు చేసిన లైట్లు ప్రారంభమయ్యాయి. పాపన్న చౌరస్తా నుంచి బ్లాక్ ఆఫీస్ చౌరస్తా వరకు 22 స్తంభాలు ఏర్పాటు చేసి లైటింగ్ ప్రారంభించకుండా అలాగే వదిలేశారు. దీంతో స్తంభాలు అలంకారప్రాయంగా మారింది. సెంట్రల్ లైటింగ్ వెలుగులు లేక, వీధి దీపాలు కూడా వెలగక రాత్రి వేళ చీకట్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా బస్సు దిగి బ్లాక్ ఆఫీస్ ఏరియాకు వెళ్లే ప్రయాణికులు రోడ్డుపై అంధకారం ఉండడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నా సంబంధిత అధికారుల పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. సెంట్రల్ లైటింగ్ నిర్మించిన డివైడర్ పనులు కూడా నాసిరకంగా చేపట్టడం, నిర్మాణ సమయంలోనే కూలిపోయిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాపన్న చౌరస్తా నుంచి బ్లాక్ ఆఫీస్ చౌరస్తా వరకు సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

## డ్రెయినేజీ నిర్మించాలని నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు, స్థానికులు

చిల్పూరు : రోడ్డుపై మురుగు నీరు పారకుండా సైడ్ డ్రెయినేజీ నిర్మించాలని, లేని పక్షంలో వార్డు ప్రజలతో కలిసి ఆందోళన చేపడతామని బీజేపీ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బాల్నె శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని పల్లగుట్ట మెయిన్ రోడ్డు పక్కన ఉన్న డ్రెయినేజీని మొరంతో పూడ్చి వేయడంతో మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. దీంతో వార్డు ప్రజలు దుర్గంధంతో పాటు దోమలతో ఇబ్బంది పడుతున్నారు. విషయాన్ని గ్రామ పంచాయతీ వారికి తెలిపిన పట్టించుకోవడం లేదని దీంతో ఆదివారం నిరసన తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అనురాధ, మౌనిక, కుమారస్వామి, అజయ్‌కుమార్, రక్షిత, రమ, నర్సయ్య, యాకరాజు పాల్గొన్నారు.

## వైభవంగా పోతరాజుల విగ్రహ ప్రతిష్ఠాపన



దేవరుప్పుల: హోమం నిర్వహిస్తున్న భక్తులు



దేవతమూర్తుల విగ్రహాలు

దేవరుప్పుల : మండలంలోని పెద్దమడూరులో కంఠమహేశ్వర స్వామి ఆలయ ఆవరణలో గౌడ సంఘం రాష్ట్ర నాయకుడు బబ్బూరి శ్రీకాంత్–రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం పోతరాజుల విగ్రహ ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణం, అభివృద్ధికి సహకరించిన శ్రీకాంత్ దంపతులను గౌడ కులస్తులు, స్థానికులు సత్కరించి అభినందించారు. అనంతరం మహా అన్నదానం చేపట్టారు. గౌడ పోపా జిల్లా అధ్యక్షుడు మేకపోతుల ఆంజనేయులు, గౌడిశాల భిక్షపతి, మామిండ్ల రాములు, పెదగోని శ్రీనివాస్, కారుపోతుల నారాయణ, బాల్దె వెంకటమల్లయ్య, తీగల దయాకర్, సత్యనారాయణ , బస్వ మల్లేష్, కోతి ప్రవీణ్ , పరిదుల భాస్కర్, దేశగాని నాగరాజు, సోమన్న, తండా రమేశ్, వడ్లకొండ వినయ్, చంద్రగిరి సంపత్ పాల్గొన్నారు.

#### ప్రతిష్ఠ మహోత్సవానికి ముస్తాబు



కొడకండ్ల : మండలంలోని ఏడునూతుల గ్రామంలో పంచముఖ నాగేంద్ర స్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవానికి ముస్తాబైంది. ఈ నెల 20, 21వ తేదీల్లో ఆలయంలో శివలింగం, నంది విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాన్ని వేదపండితుడు పాలకుర్తి సుధాకరగౌతం ఆధ్వర్యంలో నిర్వహించేందుకై ఏర్పాట్లు చేపడుతున్నారు. విగ్రహాల ప్రతిష్ఠ, మహా పూర్ణాహూతి హోమం అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ నిర్వాహకులు పాము శ్రీనివాస్‌దీపిక దంపతులు కోరారు.

## త్వరగా సర్వే పూర్తిచేయాలి



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ మల్లికార్జున్

బచ్చన్నపేట : కులగణన సర్వే ప్రక్రియను నిర్ణీత గడువులోగా త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ మల్లికార్జున్ అన్నారు. ఆదివారం మండలంలోని పలుగ్రామాల్లో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వే నిర్వాహణ తీరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్యుమరేటర్లు సర్వే చేసే విధానాన్ని, అడిగే ప్రశ్నల తీరును, సర్వే పత్రంలో కుటుంబాల నమోదును క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ ఏలాంటి తప్పులు లేకుండా కుటుంబ వివరాలను నమోదు చేయాలన్నారు.


## మిత్రుడి కుటుంబానికి చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

లింగాలఘణపురం : మండలంలోని చీటూరు గ్రామానికి చెందిన సయ్యద్ ఖలీల్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, 1992–93 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు తమ స్నేహితుడి (సయ్యద్ ఖలీల్ ) కుటుంబానికి ఆదివారం రూ.31,000 నగదు అందజేశారు. మిత్రుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, తాము అండగా ఉంటామని మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో రాంరెడ్డి,రాజు, బీరయ్య, అంజయ్య, పరశురాములు, వెంకన్న, చందర్‌రావు, నర్సింహులు, శ్రీనివాసు, కుమార్, సిద్దారెడ్డి, ఆగమల్లు, యాదగిరి తదితరులు ఉన్నారు.

## అభినందన



జనగామ రూరల్ : సాంస్కృతిక సారధి చైర్‌పర్సన్ వెన్నెలను కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ ఆదివారం హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.గద్దర్ ఆశయాలను ముందుకు తీసుకుపోవాలని అన్నారు. ఈ సందర్భంగా కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలని వినతి పత్రం ఇచ్చి చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరించారు. ఉదయ భాస్కర్, శంకర్, కడారి శ్రీను, మధు తదితరులు పాల్గొన్నారు.

## మహాసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



జనగామ రూరల్ : ముదిరాజ్ మహాసభ వాల్ పోస్టర్‌ను జిల్లా అధ్యక్షుడు నీలం గట్టయ్య ఆదివారం పట్టణంలోని మహాసభ సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. ప్రపంచ మత్స్యకారుల ఆవిర్భావ దినోత్సవం రోజునే తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆవిర్భవించిందని అన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి అలుపెరుగని పోరాటం చేస్తు కార్మికుల గుండెల్లో సంఘం నిలిచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు నిమ్మల స్వామి, చిక్కుడు రాములు, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

# హామీలు విస్మరించిన కాంగ్రెస్



రఘునాథపల్లి: మాట్లాడుతున్న రమేశ్

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్

రఘునాథపల్లి : ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని..అధికారంలోకి వచ్చాక విస్మరించిన కాంగ్రెస్‌కు రానున్న రోజుల్లో గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఊడ్గుల రమేశ్ అన్నారు. ఆదివారం రఘునాథపల్లిలో మండల అధ్యక్షుడు పుప్పాల వేణుకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వంద శాతం రైతుల రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి దేవుళ్ల మీద ప్రమాణాలు చేసి విస్మరించడం దారుణమన్నారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. 2028లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, ఇందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కావటి ముత్యాలు, జిల్లా కార్యదర్శి మంద వెంకటేశంయాదవ్, వల్లపు తిరుమల్‌ప్రసాద్, యామంకి కొమురెల్లి, బోళ్ల అఖిల్, మహేష్, వీరోజి, సుబ్బారెడ్డి, సంపత్, చంద్రమౌళి, పలు గ్రామాల బూత్‌అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



బచ్చన్నపేట: మాట్లాడుతున్న చౌడ రమేశ్

#### సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చౌడ రమేశ్

బచ్చన్నపేట : బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని కేంద్ర ప్రభుత్వ పథకాలను గడపగడపకు కార్యకర్తలు వివరించాలని ఆపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చౌడ రమేశ్ అన్నారు. ఆదివారం బచ్చన్నపేటలో పార్టీ మండల అధ్యక్షుడు చిమ్ముల నరేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సంస్థాగత ఎన్నికల కార్యశాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న స్థానిక ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో పార్టీ నుంచి అభ్యర్థులు సర్పంచ్ పదవికి పోటీ చేయాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైనదన్నారు. దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న జమిలీ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రతి గ్రామంలో క్రియాశీల సభ్యత్వాల నమోదును పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు దొంతుల చెంద్రమౌళి, మండల ఉపాధ్యక్షుడు పెండెం నాగేష్, బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకట్‌రెడ్డి, బూత్ అధ్యక్షులు రమేశ్, రాంబాబు, శ్రీను, మల్లేశం, భాస్కర్ పలువురు కార్యకర్తలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## నియామకం

పాలకుర్తి : పాలకుర్తి మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన మాచర్ల సారయ్యను తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. ఆదివారం రాష్ట్ర మహాసభలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ చేతుల మీదుగా నియామకం పత్రాన్ని అందుకున్నారు.

#### పద్మశాలీ సంఘం సహాయ కార్యదర్శులుగా..



వెంకటేశ్వర్లు



సోమనారాయణ

జఫర్‌గఢ్/రఘునాథపల్లి: రఘునాథపల్లి మండల కేంద్రానికి చెందిన కరిమికొండ వెంకటేశ్వర్లు, జఫర్‌గఢ్ మండల కేంద్రానికి చెందిన మామిడాల సోమనారాయణ రాష్ట్ర పద్మశాలి సంఘం సహాయ కార్యదర్శులుగా నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మశాలి సంఘం బలోపేతం చేయడంతో పాటు వారి సంక్షేమానికి నిరంతరం పాటుపడుతానన్నారు. పద్మశాలి, చేనేత కార్మికుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పద్మశాలిలు బరిలో నిలిచేలా సిద్ధం చేస్తామన్నారు. తమ నియమానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా కమిటీకి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

#### రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా బాల్‌రాజు

బచ్చన్నపేట: పద్మశాలి సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా బచ్చన్నపేటకు చెందిన మాజీ ఎంపీపీ వేముల బాల్‌రాజును నియమించారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో జనగామ జిల్లా నుంచి 14 మందికి కార్యవర్గ విస్తరణలో అవకాశం కల్పించారని, ఈ కమిటీ 2029 వరకు పని చేస్తుందని అన్నారు.



పాలకుర్తి : నియామక పత్రం అందుకుంటున్న మాచర్ల సారయ్య



బచ్చన్నపేట: పత్రం అందుకుంటున్న బాల్‌రాజు

## కాంగ్రెస్‌కు దూరంగా ఉంటా!

- మండల అధ్యక్షుడు రవిగౌడ్ ప్రకటన
- టీపీసీసీ చీఫ్‌కు లేఖ



కోళ్ల రవిగౌడ్

రఘునాథపల్లి : కాంగ్రెస్ పార్టీకి ఇక దూరంగా ఉంటానని పార్టీ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్ ప్రకటించారు. ఆదివారం స్టేషన్‌ఘన్‌పూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన అవమానమే ఇందుకు కారణమని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సభ విజయవంతం కోసం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఏర్పాటు చేసిన సమావేశానికి వెళ్లిన రవిగౌడ్..సమావేశం జరుగుతోన్న సమయంలో గంట సేపు నిల్చోని ఉన్నాడు. కొందరిని కూర్చోబెట్టారని, తనను నిలబెట్టి కూర్చోమని కూడా ఎవరూ అనలేదని, పార్టీ కోసం అంకితభావంతో పని చేస్తోన్న తనను అవమానించడం తట్టుకోలేక పోతున్నట్లు పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయమై టీపీసీసీ చీఫ్‌కు లేఖ రాసిననట్లు రవిగౌడ్ వెల్లడించారు. కాంగ్రెస్‌కు దూరంగా ఉంటానని వాట్సాప్ గ్రూపుల్లో ఆదివారం రాత్రి షేర్ చేయడంతో ఆ పార్టీలో దుమారం రేగింది..కాగా ఆది నుంచి కాంగ్రెస్‌లో ఉన్న వారిని కాదని, ఎమ్మెల్యేతో పాటు బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారికి నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత దక్కుతుందనే అభిప్రాయం కాంగ్రెస్ వర్గాల్లో వ్యక్తమవుతోంది. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి కడియం శ్రీహరి అనుచరుడు మారుజోడు రాంబాబుకు దక్కింది. వాస్తవంగా మాజీ జెడ్పీటీసీ లింగాల జగదీశ్ చందర్‌రెడ్డికి దక్కుతుందని అందరూ భావించారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కూనూర్ పాఠశాలలో అబ్దుల్‌కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థులు

జఫర్‌గఢ్ : మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2007–08విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల వేదికగా కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకున్నారు. విద్యార్థి దశలో తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కోరుకొప్పుల నాగేష్‌గౌడ్, స్వర్ణ, మాధవి, మమత, హాసిన, శ్రీను, రాజు, అనిల్, నరేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.